W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

29-12-2025







## జనవరి 7న జిల్లాకు కేటీఆర్ రాక

ఖమ్మం, మహా : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జనవరి 7న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రానున్నారు. ఇటీవల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులుగా గెలుపొందిన బీఆర్ఎస్ మద్దతుదారులను ఖమ్మం, కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయాల్లో జరిగే సన్మాన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో పార్టీ నేతలు నిమగ్నమయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.



05

## తల తాకట్టు పెట్టైనా నిధులు తెస్తా..

తనకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల పరిచయాలతో వైరా నియోజకవర్గంలోని గ్రామపంచాయతీలన్నీటికి కావలసిన నిధులను తల తాకట్టు పెట్టైనా తీసుకువస్తానని, నూతనంగా ఎన్నికైన సర్పంచులందరూ తమ గ్రామాలను అభివృద్ధి చేయాలని వైరా శాసనసభ్యులు మాలో త్ రాందాస్ నాయక్ సర్పంచులను కోరారు. ఆదివారం వైరా పట్టణం తన క్యాంప్ ఆఫీస్ లో ఐదు మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నూతన సర్పంచులను, లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.




02

## మహాత్మా గాంధీ పేరుని తొలగిస్తే ఉద్యమం తప్పదు

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగిస్తే మరో ఉద్యమం తప్పదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు . ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం ఆధ్వర్యంలో పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గాంధీ బొమ్మలు చేతపట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు .ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ బ య్యారం ప్రధాన రహదారిపై కూర్చొని ఎమ్మెల్యే నిరసన తెలిపారు.



# అధ్యక్షా

## నేటి నుండి అసెంబ్లీ.. మంత్రులు, ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌లోనే మకాం

ఖమ్మం, మహా

అసెంబ్లీ సమావేశాల వేళ జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలంతా హైదరాబాద్ లోనే మకాం వేశారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సహా ఇద్దరు కీలక మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు జిల్లా నుండే ఉన్నారు. కీలకమైన నీటిప్రాజెక్టులు, నదీజలాల అంశంపై సభ జరుగుతుండగా, ఉమ్మడి జిల్లాలో పోలవరం ముంపుపై ఆందోళన నెలకొంది. వీటితో పాటు నియోజకవర్గాల్లో, ఏజెన్సీలో పెండింగ్ సమస్యలు చాలా ఉన్నాయి.

- జిల్లా ఎమ్మెల్యేలంతా ప్రభుత్వంతోనే ఉండగా, సమస్యలు తీరాలని.. వరాలు కురవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రధానంగా రహదారులు, సంక్షేమ పథకాల అమలులోనూ నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆవేదన ప్రజల్లో ఉంది.

- భద్రాద్రి సమస్య ఎప్పటిలాగే ఉంది. నూతన ప్రణాళికలకు నిధుల సమస్యలున్నాయి. నేతలు నియోజకవర్గాల సమస్యలను ఎలా అసెంబ్లీలో ఎలుగెత్తుతారోనన్న ఉత్కంఠ ప్రజల్లో ఉంది.

FOLLOW: @ANNTELUGU
29-12-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## వెలుగు రిపోర్టర్‌ను పరామర్శించిన ఐబిఎస్ఈ



**కూసుమంచి, మహా:** హైదరాబాదులో నిమ్స్ ఆస్పత్రి నందు ఇటీవల కాలుకు సంబంధించిన శస్త్ర చికిత్స పూర్తి చేసుకొని కూసుమంచి మండల కేంద్రంలో తమ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వెలుగు దినపత్రిక విలేఖరి అంతోటి రామును ఇరిగేషన్ శాఖ ఎస్సీ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎస్సీ వెంకట్రావు ఆదివారం పరామర్శించారు.వారు త్వరగా కోలుకుని యధావిధిగా తన వృత్తిలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.



## సర్పంచ్‌కు ఘన సన్మానం

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఎస్సీ రిజర్వేషన్ ప్రాతిపదికన స్థానిక సంస్థ ఎన్నికల్లో అప్పయిగూడెం సర్పంచ్ గా దళిత బిడ్డ దండు ప్రవీణ్, కారేపల్లి 6వ, వార్డు మెంబర్ ఆదేర్ల అంజయ్య గెలుపొందడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా ఎమ్మార్పీఎస్ మండల కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన ఎస్సీ రిజర్వేషన్ ప్రాదిపాదికన అవకాశం దక్కడంతో గ్రామ ప్రజల సహకారంతో సర్పంచ్ పదవి దక్కడం అరుదైన గౌరవం అని, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అనుచరులు,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తిప్పారపు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు రాయల శ్రీనివాస్, మండల నాయకులు ఆదేర్ల రామారావు, చింతల శ్రీను, కాంపాటి రవి, దుపెల్లి శ్రీనివాస్, మెట్టు బాబు, దూడ అర్జున్ రావు, సతీష్, అశోక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌లిన్‌కు నివాళులర్పించిన వీరమోహన్ రెడ్డి



**తల్లాడ, మహా:** తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సంఘసాని హరిబాబు, నిర్మల దంపతుల కుమారుడు మార్క్ లిన్ గత ఏడాది మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం ఆయన వర్ధంతి గ్రామంలోని స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, తల్లాడ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దుగ్గిదేవర వెంకటలాల్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ఏడిఈ కెనడి, నాయకులు రెడ్డెం నారాయణరెడ్డి, బాలిరెడ్డి తదితరులు ఉన్నారు.

# గాంధీ పేరుని తొలగిస్తే ఉద్యమం తప్పదు

### ప్రధాన రహదారిపై కూర్చుని నిరసన తెలిపిన ఎమ్మెల్యే

### మహానుభావుడి పేరును తొలగించడం ప్రజాస్వామ్యానికి అవమానకరం



**పినపాక,మహా:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగిస్తే మరో ఉద్యమం తప్పదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు . ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం ఆధ్వర్యంలో పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గాంధీ బొమ్మలు చేతపట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు .ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ బయ్యారం ప్రధాన రహదారిపై కూర్చొని ఎమ్మెల్యే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తూ మహాత్మా గాంధీ పేరును తొలగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. మహాత్మా గాంధీ పేరు దేశానికి గర్వకారణమని, అలాంటి మహానుభావుడి పేరును సంక్షేమ పథకం నుంచి తొలగించడం ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. గాంధీ పేరు తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ ఎక్కడికక్కడ ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచి గెలిచిన సర్పంచ్ లు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

**జూలూరుపాడు, మహా:** సహకార సంఘాల పాలక మండళ్లను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు డిమాండ్ చేశారు. రాజకీయ నిరుద్యోగులకు నామినేటెడ్ పదవులతో భర్తీ చేసేందుకే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పీఏసీఎస్ సంఘాలను రద్దు చేశారని విమర్శించారు. జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇవాళ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. పీఏసీఎస్, డీసీసీబీ బ్యాంకుల పాలక మండళ్లను రద్దు చేసిందన్నారు. వీటి స్థానంలో నామినేటెడ్ పదవులను ఇవ్వాలనే ఆలోచనలు సహకార స్ఫూర్తికి విరుద్ధంగా కుట్ర పన్నుతున్నట్టు ధ్వజమెత్తారు. ఈ తరహా నిర్ణయం రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. నామినేటెడ్ పదవుల పేరుతో అర్హత ఉన్న రైతులను విస్మరిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే పదవులు ఇవ్వాలనే ప్రభుత్వం భావించడం సిగ్గు చేటన్నారు. సహకార సంఘాలు పూర్తిగా రాజకీయ పార్టీలుగా మారే ప్రమాదం ఉందన్నారు. రుణమాఫీ చేయనందున కాంగ్రెస్ పార్టీకి రైతులపై



నమ్మకం లేకుండా పోయిందన్నారు. అందుకే సహకార సంఘాలను రద్దు చేశారన్నారు. రైతు సమస్యలను పరిశీలించి సహకార సంఘాలను రద్దు చేయకుండా వెంటనే ఎన్నికలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు డిమాండ్ చేశారు.

# ఖాకీ ముసుగులో కల్తీ మద్యం వ్యాపారం

## కారేపల్లిలో వెలుగులోకి వస్తున్న కల్తీ మద్యం ముఠా అక్రమాలు

## కాపాడే ప్రయత్నంలో ఎక్సైజ్ అధికారులు

**కారేపల్లి, మహా:** కారేపల్లి కేంద్రంగా కల్తీ మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది.. ఓ ఖాకీ ముసుగులో జరుగుతున్న కల్తీ మద్యం వ్యవహారం ఎక్సైజ్ అధికారులు బట్ట బయలు చేసినట్టే చేసి ఆ ఖాకీని కాపాడేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. కారేపల్లి లోని శ్రీ కనకదుర్గ వైన్ షాప్ యజమాని తన నివాసం ఉండే తండాలో తన ఇంటి వద్ద బెల్ట్ షాప్ కూడా నిర్వహిస్తుంటాడు. శుక్రవారం ఎక్సైజ్ అధికారులు శ్రీ కనకదుర్గ వైన్స్ యజమాని ఇంట్లో తనిఖీలు చేసి 30 బాటిల్ల అక్రమమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అందులోని 16 బ్లెండర్స్ ప్రైడ్ బ్రాండ్ మద్యం బాటిళ్ళు కల్తీ మద్యం గా గుర్తించారు. ఎక్సైజ్ అధికారుల వద్ద ఉండే ఓ కిట్టు ద్వారా ప్రాథమికంగా మద్యాన్ని తనిఖీ చేసి నకిలీ మద్యాన్ని గుర్తించే సౌలభ్యం ఉంది. ఈ పరికరం ద్వారా గుర్తించినప్పటికీ ఎక్సైజ్ అధికారులు యజమానిని కాపాడడం కోసం చేయరాని పొరపాట్లన్నీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

### ఇంటి యజమానిని వదిలి అతని భార్యపై కేసు ఎందుకు పెట్టారు?

కారేపల్లి ఎక్సైజ్ అధికారు లు శ్రీ కనకదుర్గ వైన్స్ షాప్ యజమాని ఇంట్లో కల్తిమద్యం బాటిల్లను సీజ్ చేసి ఇంటి యజమానిపై కేసు పెట్టకుండా అతని భార్యపై కేసు నమోదు చేసినట్లు ప్రకటించారు. ఇంటి యజమాని పోలీస్ శాఖలో హొంగార్డుగా పనిచేస్తున్నాడు కాబట్టి అతన్నీ కాపాడటం కోసమే అతని భార్యపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ శాఖ కూడా అక్రమంలో భాగస్వామ్యం అయిందనే ఆరోపణలు ఉన్నాయి. కల్తీ మద్యం అని ప్రాథమికంగా నిర్ధారణ అయినప్పటికీ ఒక రోజు వరకు గోప్యంగా ఉంచి రెండో రోజు కేసు నమోదు చేశామని ప్రకటించడం విచిత్రంగా ఉంది. ఆ కేసు కూడా కల్తీ మద్యం అనే విషయాన్ని ప్రస్తావించకుండా తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి వైన్ షాప్ యజమానిని కాపాడటం కోసం చేసిన ప్రయత్నాలే అని మాంసం తింటున్నామని బొక్కలు మెడలో వేసుకున్న చందంగా ఉంది.



### వైన్స్ షాపుల్లోనూ కల్తీ మద్యం..

ఖాకీ ముసుగులో అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్న ఈ వ్యాపారి వైన్ షాప్ కౌంటర్ లోనే కూర్చుంటూ గత నెల రోజులుగా బహిరంగంగానే వ్యాపారం చేస్తున్నారు. ఖాకీ ఉద్యోగానికి కొంతకాలం సెలవు పెట్టి ఈ అక్రమ వ్యాపారానికి పూర్తి సమయం కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతను నిర్వహించే వైన్ షాప్ లో మద్యాన్ని కల్తీ చేసేందుకు ఒక ఎక్స్ పర్ట్ ను కూడా నియమించుకున్నాడనే ప్రచారం జరుగుతుంది. మద్యాన్ని కల్తీ చేయడం లో నిష్ణాతుడిని నియమించుకొని కల్తీ మద్యం వ్యాపారం జోరుగా సాగిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యాపారి కల్తీ వ్యాపారం చేస్తూ రెడ్ హ్యాండెడ్ గా దొరికినప్పటికీ కఠిన చర్యలు చేపట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు అతన్ని కాపాడే ప్రయత్నాలు చేయడం కారేపల్లి మండల వ్యాప్తంగా  చర్చనీయాంశమైంది. ఎక్సైజ్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు కారేపల్లి మండలంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నేటి నుంచి అందుబాటులోకి యూరియా బుకింగ్ యాప్



**చింతకాని, మహా:** నేటి నుంచి రైతులకు యూరియా బుకింగ్ యాప్ అందుబాటులోకి రానున్నట్లు మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. విజయ చంద్ర తెలిపారు. ప్రస్తుత యాసంగి సీజన్లో యూరియా కొనుగోలు చేయుటకు వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ అమలులోకి తీసుకువచ్చిందని ఆయన తెలిపారు .గత వాన కాలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ యాప్ ను అమలులోకి తీసుకురావడం జరిగిందని,రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంటను బట్టి వారికున్న విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో ఏ డీలర్ అయినా ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకునే అవకాశం రైతులకు ప్రభుత్వం కల్పించింది అని అన్నారు .ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చెయ్యాలని,ఏదైనా పరిస్థితులలో 24 గంటల లోపు యూరియాను తీసుకోనట్లయితే ఆ యొక్క బుకింగ్ రద్దు అవుతుందని, మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వాళ్ళు  కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. కౌ లు దారులు అయితే వాళ్ళు ఎవరి దగ్గర అయితే కౌలుకు తీసుకున్నారు వారి యొక్క పట్టాదారు పాస్ బుక్ నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చు .అయితే ఆ పట్టాదారు ఓటీపీ చెప్పాల్సి ఉంటుందన్నారు .ఈ యొక్క యాప్ ను రైతులకు అలవాటు చేయటానికి అవగాహన కల్పించడానికి ప్రతి ఔట్లెట్ దగ్గర వ్యవసాయ శాఖ ద్వారా ఒక వ్యక్తిని నియమించడం జరుగుతుందని లేదా సంబంధిత ఏఈ ఓ రైతులకు సహాయం చేయడం జరుగుతుంది .కాబట్టి రైతులందరూ కూడా ఈ యొక్క యాప్ వినియోగించుకొని యూరియాను కొనుగోలు చేయవచ్చు అని సూచించారు.

# మారుమూలలలో సొసైటీ సేవలు విస్తరించటమే లక్ష్యం

**నేలకొండపల్లి, డిసెంబర్ 28 మహా:** భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సేవలు మారుమూలలలో కూడ "విస్తరించటమే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పచ్చా తిరపయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వాసవి భవన్ లో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత నూతన కమిటి ని ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు గా పచ్చా తిరపయ్య, కార్యదర్శి గా గెల్లా వెంకటరమణ గుప్తా, కోశాధికారిగా దండా రవీంద్రబాబు లతో పాటు ఈసీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటి ప్రమాణాస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడారు...సొసైటీ ని బలోపేతం చేసేందుకు, సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయ అవగాహన సదస్సులు, ప్రజలకు ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గెల్లా జగన్మోహన్రావు, ఖాసింసాహెబ్, వెల్లంపల్లి శ్రీనివాసరావు, వి.భాస్కర్రావు, యలమద్ది లెనిన్, పాలడుగు పూర్ణచందర్ ప్రసాద్, కోటేశ్వరరావు, రేలా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర నిధులతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధి

**నేలకొండపల్లి, మహా:** కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నా రు. మండలం లోని కొత్తకొత్తూరు గ్రామంలో ఆదివారం మన్కీబాత్ 129 ఎపిసోడ్ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడారు.....కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో అనేక మందికి అందుతున్నట్లు ప్రకటిం చారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా అభివృద్ధి చెందే దేశంగా ఆ దేశాలకు పోటీగా భారతదేశం అభివృద్ధి చెందుతుం దని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, మండల ఉపాధ్యాక్షుడు కొండా హర్ష, యువ మోర్చా మండల అధ్యక్షుడు తంగెళ్ల సతీష్, మండల పదాదికారులు గెల్లా .



నాగసాయి. కందరబోయిన గోపి, వేణుబాబు, ఉదయ్ పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
29-12-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# రతన్ టాటా సేవలు చిరస్మరణీయం

## కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రముఖ పారిశ్రామికవేత్త, భారతరత్న రతన్ టాటా దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కొనియాడారు. ఆదివారం కొత్తగూడెంలోని టాటా ఏఐఏ బ్రాంచ్ లో రతన్ టాటా 88వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రతన్ టాటా వంటి మహోన్నత వ్యక్తి భారతదేశంలో జన్మించడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. కేవలం వ్యాపారవేత్తగానే కాకుండా తన సంపాదనలో సింహభాగాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించి కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారని ఆయన గుర్తు చేశారు. లాభాల కంటే విలువలకే ప్రాధాన్యతనిచ్చిన గొప్ప మానవతా వాది రతన్ టాటా అని అన్నారు. భారత పారిశ్రామిక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కృషి అనన్యం అని పేర్కొన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడిచి దేశాభివృద్ధికి తోడ్పడాలనీ పిలుపునిచ్చారు. అనంతరం లీడర్ ఝాన్సీ రాణి ఫైనాన్సియల్ సర్వీసెస్(సీఈవో) కమల రాణి కొచ్చెర్ల రక్త దానం చేస్తూ తన టీం తో కూడా రక్త దానం చేయించారు. అందరికి డీఎస్పీ అభినందిస్తూ వారికి సర్టిఫికేట్ ను అందించారు. ఈ కార్యక్రమంలో లీడర్స్ చందు, ఎండి ఆర్‌టి సామ్రాజ్యం, డేవిడ్ రాజు, ప్రభు, లాల్ బాబు, జ్యోత్స్న, రాకేష్ కాంత్, సురేఖ, టాటా ఏఐఏ బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్, బామ్ రాహుల్ వెంకటేష్, లీడర్లు, అడ్వైసర్లు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.




## అంగన్వాడీ లో వార్డు సభ్యులు.. పేరెంట్స్ శ్రమదానం

**నేలకొండపల్లి, మహా:** స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో పేరుకపోయిన చెత్తచెదారం...అడవిని తలపించేలా చెట్లు ఏపుగా పెరిగాయి...మండల కాంగ్రెస్ నాయకురాలు పసుపులేటి శ్రీలత సూచన మేరకు శ్రమదానం నిర్వహించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ లోని ఎస్సీ, బీసీ కాలనీ 13, 14 వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రం లో పారిశుద్ధ్యం లోపించింది. కాలనీ వాసులు కాంగ్రెస్ నాయకురాలు పుసుపులేటి శ్రీలత కు విషయం ను అందించారు. ఈ మేరకు స్పందించిన శ్రీలత అంగన్వాడీ కేంద్రం ను సందర్శించి... పరిస్థితులను పరిశీలించారు. స్థానిక 13, 14 వార్డు సభ్యులు కొడిరెక్క వినోద్, మన్నె నరేష్ లు మరియు పేరెంట్స్ తో ప్రత్యేక సమావేశం ను నిర్వహించి.. అంగన్వాడీ కేంద్రంలో ఆదివారం శ్రమదానం కార్యక్రమం ను నిర్వహించారు. అంగన్వాడీ ని ఆదర్శంగా తయారు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ "పెద్దలు తెలగపల్లి ఉపేందర్, కైలాసపు నాగేశ్వరరావు, బండి రాముడు, కైలాసపు గోపి, పల్లపు నవీన్, సోమోజీ, ధనమూర్తి, రామకృష్ణ, ఎల్లయ్య, సంధీప్, ఉపేందర్, మహేష్, వెంకటేష్, కోడిరెక్క శ్రీకాంత్, వినయ్, తేజ, మోహాన్, నవీన్, జాషువా, వేణు, సాయి తదితరులు పాల్గొన్నారు.



## యువతను ప్రోత్సహిస్తున్న అనంతారం సర్పంచ్



**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని అనంతరం గ్రామ సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టిన కొర్సా రమేష్ గ్రామ యువతను క్రీడలలో రాణించాలని ప్రోత్సహిస్తున్నారు. యువత మత్తు పదార్థాలకు, బెట్టింగ్ లకు అలవాటుపడి జీవితాన్ని ఆగం చేసుకోవద్దని, యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలంటే ఏదో ఒక పనిపై ధ్యాస పెట్టాలని అన్నారు. ఆర్థికంగా ఎట్లా బలపడాలో ఆలోచించాలని, అందుకు శరీరాన్ని కూడా ఆరోగ్యవంతంగా చేసుకోవడానికి శారీరక వ్యాయామం తో పాటు, ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలు తీసుకోవాలని కోరారు. అందులో భాగంగానే యువతను క్రీడల వైపు మళ్లిచేందుకు కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడల వైపు దృష్టి మరలిస్తున్నారు. అందుకు గ్రామ కబడ్డీ టీం సభ్యులకు స్పోర్ట్స్ టి షర్ట్స్ ఆదివారం పంపిణీ చేశారు. ఇప్పటికే గ్రామంలో బీదవారిని ఆర్థిక సాయంతో ఆదుకుంటున్న సర్పంచ్ రమేష్ యువతకు ఏం సాయం కావాలన్నా తనవంతు కృషి చేస్తానని, యువత బలంగా ఉంటేనే గ్రామం బలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు అరెస్ట్

**తల్లాడ, డిసెంబర్, 30 (మహా ):** గత గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని హైదరాబాదులో తలపెట్టే కార్యక్రమానికి వెళుతున్న తల్లాడ మండలం గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావును తల్లాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తల్లాడ ఎస్సై 2 వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి అరెస్టు చేశారు. అనంతరం మోహన్ రావు మాట్లాడుతూ సర్పంచుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి వెళుతున్న తమను అరెస్టు చేయటం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చెన్నారావు తదితరులు ఉన్నారు.





## ఉపాధి హామీ చట్టానికి మోడీ తూట్లు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తూట్లు పడుతుందని జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ చట్టంలో మార్పులు చేసి జాతిపిత గాంధీ పేరును తొలగించి పేదల కడుపు కొట్టాలని చూస్తున్న మోడీ విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రీ టౌన్ సెంటర్లో నిరసన ప్రదర్శన మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ, ఆళ్ళ మురళి, నాగ సీతారాములు, జేబీ బాలసౌరి, ఏనుగుల అర్జున్ రావు, చీకటి కార్తీక్, పౌలు, పట్టణ నాయకులు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై శ్రీనివాస్ రెడ్డి, చింతలపూడి రాజశేఖర్, రావి రాంబాబు, మేరెడ్డి జనార్దన్ రెడ్డి బాల పాసి, పరమేష్, యాదవ్ పాల సత్యనారాయణ రెడ్డి, తలుగు అనిల్, ఆకుల సుధాకర్, సుందర్లాల్ కోరి, రాజేష్, జానీ పాషా, మాధవ్,రాజేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకులు గడిపల్లి కవిత, రాజ్యలక్ష్మి, వాణి రెడ్డి, జోగు రమాదేవి, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

**పినపాక, మహా:** మండల పరిధి జానంపేట గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో సర్పంచ్ ఉమామహేశ్వరి జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## యాఫ్ ద్వారానే యూరియా అమ్మకాలు - ఏవో

**కారేపల్లి, మహా:** రైతులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు నివారించటానికి యూరియా పంపిణిని ప్రభుత్వం యాఫ్ ద్వారా పంపిణికి సమాయత్తం అవుతుందని సింగరేణి మండల వ్యవసాయాధికారి బీ.అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం సింగరేణి మండల డీలర్లతో టెలికాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈసమావేశంలో ఏవో మాట్లాడుతూ యూరియా యాఫ్ పై రైతులకు అవగాహన కల్పించటానికి వాలంటీర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పురుగుమందులు, ఎరువుల దుకాణాల వద్ద తప్పనిసరిగా వాలంటీర్లను ఏర్పాటు చేసి రైతులకు యాఫ్‌పై అవగాహన కల్పించాలని డీలర్లను ఆదేశించారు. సింగరేణి మండలంలో సోసైటీ ఆధ్వర్యంలోని కారేపల్లి, సీతారాంపురం, మాధారం, గేటుకారేపల్లి సబ్ సెంటర్లలో యూరియా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## హత్య కేసులో నిందితుడు రిమాండ్

కారేపల్లి, మహా : కారేపల్లి మండలం రూప్లాతండా కు చెందిన భూక్యా హరిదాస్ కొంతకాలం క్రితం అనుమానాస్పద స్థితిలో మఅతి చెందాడు. ఆ కేసు కు సంబంధించి పోలీసులు అదే గ్రామానికి చెందిన నిందితుడు గుగులోత్ శంకర్ ను శనివారం అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు సింగరేణి సీఐ నూనావత్ సాగర్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆదివారం సిఐ మాట్లాడుతూ భూక్యా హరిదాసు మఅతి కేసులో పూర్తి స్థాయి విచారణ అనంతరం నిందితుడు గుగులోత్ శంకర్ ను రిమాండ్ చేసి, ఖమ్మం జైలుకు తరలించినట్లు తెలిపారు.




# తల తాకట్టు పెట్టైనా నిధులు తెస్తా

### గ్రామాలను అభివృద్ధి చేయండి

### కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో నూతన సర్పంచులకు హామీ ఇచ్చిన వైరా ఎమ్మెల్యే





**జూలూరుపాడు, మహా:** తనకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల పరిచయాలతో వైరా నియోజకవర్గంలోని గ్రామపంచాయతీలన్నీటికి కావలసిన నిధులను తల తాకట్టు పెట్టైనా తీసుకువస్తానని, నూతనంగా ఎన్నికైన సర్పంచులందరూ తమ గ్రామాలను అభివృద్ధి చేయాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సర్పంచులను కోరారు. ఆదివారం వైరా పట్టణం తన క్యాంప్ ఆఫీస్ లో ఐదు మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నూతన సర్పంచులను, లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తనకు ప్రజాసేవ తప్ప వేరే ఎలాంటి వ్యాపారాలు లేవని తెలిపారు. నిరంతరం వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో అందరితో మమేకమై ఉంటూ, గ్రామ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచులను కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు గ్రామాలలో అర్హులైన పేదలందరికీ సమానంగా అందించాలని సూచించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి, రాష్ట్రంలో వైరా నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా 185 మంది లబ్ధిదారులకు ఒక కోటి 85 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అందులో జూలూరుపాడు మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు 46 లక్షల 5,336 రూపాయల విలువగల చెక్కులను ఆయా గ్రామ పంచాయతీల సర్పంచుల చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జూలూరుపాడు మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, పడమట నర్సాపురం సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఆర్కే నాయుడు, మెంతుల కృష్ణ, కట్రం నరసింహారావు, సంగం చిన్నరాజు, బూరం రమేష్ తోపాటు, అనంతారం, వినోబానగర్, సాయిరాం తండా, పాపకొల్లు, కరివారి గూడెం, గుల్లరేవు, గాంధీనగర్ సర్పంచులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లను సన్మానించిన చేపల సోసైటీ


**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని గేటుకారేపల్లి, రేగులగూడెం లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పూసం ఎల్లయ్య, వీసం మోతీ వీరస్వామి లను మత్స్యసహకార సంఘాల సభ్యులు ఆదివారం సన్మానించారు. ఈసందర్భంగా సీనియర్ మత్ససహకార సంఘ సభ్యులు తోటకూరి సుధాకర్ మాట్లాడుతూ మత్స్యసహకార సంఘం సభ్యులకు సర్పంచ్‌లు అన్ని విధాల సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఈసం ఐలయ్య, భూక్యబంగి, భూక్యా చిట్టిబాబు, పిట్టల వెంకటేశ్వర్లు, మాడె సత్యనారాయణ, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, నూతలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు





## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావం దినోత్సవం

**కూసుమంచి, మహా:** భారత జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకులను కూసుమంచి మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కూసుమంచి మండల కేంద్రంలోని రాజీవ్ చౌక్ లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ హాఫీజుద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండా కృష్ణవేణి, గ్రామ ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ, యువజన నాయకులు బెల్లంకొండ శరత్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాణోత్ పీర్యా నాయక్, గుండా భూపాల్ రెడ్డి, మాదాసు ఉపేందర్ రావు, బెల్లంకొండ వెంకన్న, వార్డు సభ్యులు. అంతోటి వెంకన్న, రామనాథం, రమాదేవి, గుండాబుచ్చిరెడ్డి, దామళ్ళ పాపారావు, గుండా విజయ్‌పాల్ రెడ్డి, గుండా లింగారెడ్డి, సాజిద్ పాష, షేక్ నాగులు మీరా, బండారుపల్లి శ్రీనివాస రావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు వార్డుసభ్యులు, పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా మండలంలోని వివిధ గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులను, వార్డు సభ్యులను, మూడు రంగుల కండువాలతో సీనియర్ నాయకులు హాఫీజుద్దీన్ సన్మానించి అభినందించారు.



## గెలిచిన.. ఓడిపోయిన అధైర్యపడొద్దు..

# వచ్చేది మన ప్రభుత్వమే

### మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి

**కూసుమంచి, మహా:** గెలిచిన ఓడిపోయిన ఏ ఒక్కరు అధైర్య పడొద్దని, రాబోయేది కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాలు ఉపేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూసుమంచి మండలంలోని, చేగొమ్మ గ్రామంలో ఆదివారం ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూసుమంచి మండలంలో గెలిచిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన గ్రామ 12 మంది సర్పంచులు, 130 మంది వార్డ్ మెంబర్లు,15 మంది వైస్ ప్రెసిడెంట్ లకు విజయోత్సవ సన్మాన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేగొమ్మ గ్రామంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విజయోత్సవ సభలో కందాల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోయిన వారు అధైర్యపడకుండా, ఓటమికి గల కారణాలను విశ్లేషించుకోవాలని ఆయన సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.“నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒక్క రోజు కూడా విశ్రమించలేదు. గెలిచినా, ఓడినా ప్రజలనే నా కుటుంబంగా భావించి పనిచేస్తున్నాను. అన్నారు. కానీ నేటి నాయకులు ప్రజలను దుర్భాషలాడటం సరికాదు అని లిఓట్లేసి గెలిపించినందుకు ప్రజలు ఎందుకు తిట్లు తినాలో ఆలోచించాలి అని అన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సర్పంచ్‌లకు సూచించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సర్పంచులు, వైస్ ప్రెసిడెంట్లు, వార్డు మెంబర్లకు, సన్మానం నిర్వహించారు.

## యడవల్లి రాంరెడ్డి కుటుంబానికి పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**కూసుమంచి, మహా:** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యడవల్లి రాంరెడ్డి కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యడవల్లి రాంరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మట్టె గురవయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

### నేలపట్ల ప్రజాప్రతినిధులకు తుంబూరు దయాకర్‌రెడ్డి దిశానిర్దేశం



**కూసుమంచి , మహా:** ప్రజలు అప్పగించిన బాధ్యతను విస్మరించకుండా, గ్రామాభివృద్ధే పరమావధిగా నూతన ప్రజాప్రతినిధులు పనిచేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం నేలపట్ల గ్రామానికి చెందిన నూతన ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఘన విజయం సాధించిన సర్పంచ్ నూకల శోభన్‌బాబు, ఉపసర్పంచ్ తుడుం శ్రీనివాసరావు, వార్డు సభ్యురాలు దుంపల వసంతకు దయాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిశాయని, ఇకపై గ్రామంలోని ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. మంత్రి పొంగులేటి సహకారంతో నేలపట్లకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దండ్యాల లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పాలకుర్తి వీరబాబు, నాయకులు జాల శోభన్‌బాబు, వార నాగరాజు, పాలపాటి కాంతారావు, తుడుం క్రాంతికుమార్, నూకల పూర్ణచంద్రరావు, తుడుం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.లి

# జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో మహంకాళికి ఘన సన్మానం



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మహంకాళి రామారావు నియామకంపై పినపాక నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు లావడ్య రాములు నాయక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బీసీ వర్గ ముద్దుబిడ్డ ఇరవెండి గ్రామ పంచాయతీకి చెందిన మహంకాళి రామారావును అధికారికంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీసీ సంఘం అభివృద్ధి కొరకు అహర్నిశలు పాటుపడే వ్యక్తిత్వం ఉన్న రామారావు జిల్లా ఉప సర్పంచుల సంగం అధ్యక్షులుగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై రాజకీయ రంగంలో పదోన్నతులు సాధించి బిసి వర్గ అభివృద్ధికి తోడ్పడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉప సర్పంచుల బలోపేతం చేయడంతో పాటు బీసీ వర్గ అభివృద్ధికి తోడ్పడాలని కార్యాచరణ అమలులో క్రియాశీలకంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ఉపాధ్యక్షుడు మెండే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజ్జంకి కనకచారి, నియోజకవర్గ అధ్యక్షులు నిదానపల్లి బాలకృష్ణ, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు వారాల వేణు,మండల అధ్యక్షులు దాసరి సాంబ, ఉపాధ్యక్షులు చిప్పా రాజు, మండల కార్యదర్శి మండల కార్యదర్శి నరసింహారావు,వట్టికొండ రామకృష్ణ,విద్యార్థి సంఘం నాయకులు జక్కుల సందీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ వనిగండ్ల మాధవరావు తేనేటి విందుకు హాజరైన సండ్ర

**తల్లాడ, మహా):** తల్లాడ మండలం కేశ్వాపురం బి ఆర్ యస్ పార్టీ గ్రామ పంచాయితీ సర్పంచ్ వనిగండ్ల.మాధవ రావు గెలిచిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ తేనేటి విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరైనారు. ముందుగా గ్రామంలో ఎల్లమ్మ తల్లి దేవాలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, శీలం ముత్తారెడ్డి, వానీగండ్ల. అశోక్, వజ్రాల. రామిరెడ్డి, తాళ్లూరి.నరసింహారావు, నాయుడు.శ్రీనివాసరావు,



ముత్తా రెడ్డి , మాజీ సర్పంచ్ వనిగండ్ల. అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ 141 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చర్ల మహా:** చర్ల మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇందుల బుచ్చిబాబు, తాండవరాయుడు, తాళ్లూరి రంగారావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే ప్రజల కోసం పోరాటం,కాంగ్రెస్ అంటే అభివృద్ధి సంక్షేమం, కాంగ్రెస్ అంటే ప్రజల భవిష్యత్తు అని దేశ స్వాతంత్రానికి పునాదివేసి బ్యాంకుల జాతీయ కరణ, గరీబీ హటావో,సామాజిక న్యాయము, సమానత్వము, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ఏకైక పార్టీ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ. 1885 డిసెంబర్ 8న బొంబాయిలో 72 మందితో ఏర్పడి జాతీయ కాంగ్రెస్ పార్టీ నేడు దేశంలో 140 కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రజల్లో జాతీయ భావాన్ని రేకెత్తించి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకొచ్చారు. ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ దేశం కోసం



బలిదానం అయ్యారని,పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని, సోనియా గాంధీ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లాంటివాళ్ళు దేశం కోసం నిరంతరం శ్రమించారు, దేశానికి స్వతంత్రం తెచ్చిన తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను తీర్చిన, అది కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమైందని చెప్పుకొచ్చారు.తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగా అధికారంలోకి వచ్చిందని వారు అన్నారు.

# కూతురే కొడుకు అయిన వేళ

## ఘనంగా తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కనకం భాగ్యలక్ష్మి

**చర్ల మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రైస్ పేట కాలనీలో నివాసం ఉంటున్న పూనెం లక్ష్మీనారాయణ లక్ష్మీ కుమారి దంపతులకు ఇద్దరు కుమార్తెలు అందులో పెద్ద కుమార్తె పూనెం భాగ్యలక్ష్మి మరియు పూనెం ఉషారాణి ఉన్నారు కొంతకాలం క్రితం భద్రాచలం భద్రాచలం నివాసి అయిన కనకం శ్రీమన్నారాయణ ను కులాంతర వివాహం చేసుకున్న పూనెం భాగ్యలక్ష్మి కి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి అయిన పోణ్యం లక్ష్మీనారాయణ తీవ్ర అస్వస్థకు గురై 28 వ తారీఖున ఆదివారం నాడు చికిత్స పొందుతూ భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరణించినారు కుమారుడు లేని తన ఇంటిలో సంప్రదాయపరంగా కొరివి పెట్టాల్సిన బాధ్యత పెద్ద కుమార్తె అయిన పూనెం భాగ్యలక్ష్మి తీసుకొని తన తండ్రికి ఘనంగా భారీ జన సందోహంతో ఊరేగింపుతో అంత్యక్రియలు నిర్వహించి కన్నతండ్రి రుణం తీర్చుకుంది ఈ సంఘటన చూసిన చర్ల మండల ప్రజలు శభాష్ అంటూ కంటే కూతుర్నే కనాలి అంటూ అభినందిస్తున్నారు



# ఉపాధి హామీ పేరు తొలగింపుపై నిరసన

**బూర్గంపహాడ్ మహా:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో మహాత్మా గాంధీ పేరు తొలగించడంతో ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మహాత్మా గాంధీ



చిత్రపటంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆనాటి దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యవసాయ కూలీలకు వందరోజుల పని కల్పించాలని మంచి ఉద్దేశంతో ప్రారంభించిన పథకాన్ని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించటం సమంజసం కాదని పేర్కొన్నారు. స్వాతంత్రం సాధించి నా జాతిపిత పేరు తొలగించటం బిజెపి నిరంకుశత్వానికి నిదర్శనగా తక్షణమే మహాత్మా గాంధీ పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతు రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి ,జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహమూద్ ఖాన్, నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజనసతీష్, మాజీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి ,చల్లా వెంకట నారాయణ ,భజన ప్రసాద్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిర్రా ప్రభాకర్ , దేగల భద్రం,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**బూర్గంపహాడ్ మహా:** బూర్గం పహాడ్ మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో, సారపాక ప్రధాన కూడలిలో పార్టీ



ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి లు మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ డిసెంబర్ 28 1885లో స్థాపించారని మూడు దశలుగా పోరాటం చేసి పరాయి పాలన నుండి భారతదేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహమూద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, చల్లా వెంకటనారాయణ,మండల మాజీ అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి,స్థానిక ఉపసర్పంచ్ గుండె వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భజన ప్రసాద్, నాగం, వారాల వేణు, దేగల భద్రం, సిర్ర ప్రభాకర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిన్నమండవ సర్పంచ్ రామచంద్ర రావు కలిసిన సీనియర్ మండల నాయకులు

**చింతకాని డిసెంబర్ 28(మహా):** చింతకాని మండలం చిన్నమండవ గ్రామానికి నూతన సర్పంచిగా ఎన్నికైన పర్చ రామచంద్రరావు పాతర్లపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొండ్రు జానకిరామయ్య (సీపీఎం ) ,యాదగిరి, రమేష్ సిపిఐ పార్టీ నాయకులు సర్పంచ్ గా ఎన్నికైనందుకు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించటం జరిగింది..



# గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన

### ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, దయానంద్ విజయకుమార్ ప్రముఖ అతిథులుగా హాజరు

### గంగారం దాసరి కుటుంబంపై మంత్రి తుమ్మల ప్రశంసలు

**సత్తుపల్లి, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గంగారం గ్రామ పంచాయితీ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే గ్రామంలో తన సొంత నిధులతో వివిధ శాఖలతో కూడిన సమీకృత పంచాయతీ భవనాన్ని నిర్మిస్తానని కాంగ్రెస్ నాయకుడు దాసరి చిట్టి నాయన కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. తమ అభ్యర్థి కాకర్ల రేవతి గ్రామ సర్పంచిగా విజయం సాధించిన అనంతరం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సమీకృత గ్రామ పంచాయతీ భవనాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేతుల మీదుగా ఆదివారం శంకుస్థాపన చేయించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ దాసరి వీరారెడ్డి కుమారుడు చిట్టి నాయన వారి వారసుడు మధుమోహన్ రెడ్డి గంగారం గ్రామానికి అభివృద్ధిని పరిచయం చేశారని, పుట్టిన నేలను అభివృద్ధి చేయాలనే వారి కాంక్ష అభినందనీయమని కొనియాడారు. అందరూ సంపాదిస్తారు కానీ తాము సంపాదించిన దాంట్లో పేద ప్రజలకు సేవ చేయాలనే వారు కొందరే ఉంటారని అటువంటి వారిలో దాసరి వీరారెడ్డి కుమారుడు దాసరి చిట్టి నాయన, మనుమడు దాసరి మధుమోహన్ రెడ్డి ముందుంటారని వారి సేవలను కొనియాడారు. దాసరి మధు మోహన్ రెడ్డి తన కష్టార్జితం లో గ్రామ ప్రజల అవసరం నిమిత్తం సుమారు కోటి రూపాయల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల అన్నారు. మధుమోహన్ రెడ్డి కుటుంబం ఈ గ్రామంలో అన్ని కులాల వారికి కమ్యూనిటీ భవనాల నిర్మించి వారి ఉదారతను చాటుకున్నారని మధుమోహన్ రెడ్డి కుటుంబం సేవలను కొనియాడారు. గంగారం, రామ గోవిందాపురం గ్రామపంచాయతీల అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతంగా పేరు ఉందని జలగం వెంగళరావు తర్వాత ఈ ప్రాంతాన్ని అంత అభివృద్ధి చేసే అదృష్టాన్ని ఆ దేవుడి ఆశీస్సులతోపాటు సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఇచ్చారన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయాల ద్వారానే ఎక్కువ కాలం రాజకీయంగా మనుగడ సాధించవచ్చు అన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ దాసరి మధుమోహన్ రెడ్డి కుటుంబం తమ గెలుపులో కూడా ఎంతో సహకరించారని, గంగారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకర్ల రేవతి విజయం సాధించడంలో దాసరి కుటుంబం పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఎన్నికల హామీల్లో భాగంగాఎన్నికలు జరిగిన పది రోజుల్లోనే చెప్పిన విధంగా పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు.ముందుగా ప్రకాష్ నగర్ లో 50 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. మొత్తంగా కోటి 25 లక్షల సొంత నిధులతో దాసరి మధుమోహన్ రెడ్డి కుటుంబం గ్రామాభివృద్ధికి తోడ్పడటం హర్షణీయమని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్. కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, గంగారం గ్రామ సర్పంచి కాకర్ల రేవతి,రామ గోవిందాపురం సర్పంచి మందపాటి మౌనిక రెడ్డి, దాసరి చిట్టి నాయన, బెజవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



